Assemblies Of The Living Elohim (1. Tim 3:15) India presents............ ఎలోహిం యొద్దకు రండి అప్పుడు ఆయన మీ యొద్దకు వచ్చును

# సత్యమునకై పోరాటం

Regd. Monthly Newspaper
**Postal Regd. No. H/APM/01/2009-2011**
Valid upto 12/2011
Posted on 30th of Every Month
**Annual Subscription Rs. 50/-**
To :

**Editor & Publisher :**
**Bro. Isaac E. Kusuma**
**Malikipuram - 533 253**
**E.G. Dist. (A.P.) India.**

**Website : www.aotle-india.org**
**E-mail : satyamunakaiporatam@gmail.com**
**Office : Ph : 98493 85038**

**VOLUME : 13 TAMMUZ - AV 5770 (JUNE 2010) PAGES:4 ISSUE 144**

**హెచ్చరిక:- ఈ పత్రిక ఖండితముగా సత్యాన్వేషుల కొరకు మాత్రమే గాని క్రైస్తవ మతశాఖల వారి కొరకు కాదు**

# పాతనిబంధన యాజకులు Vs క్రొత్త నిబంధన యాజకులు

పాతనిబంధన కాలంలో 12 గోత్రికులైన ఇశ్రాయేలీయులకు సేవ చేయు నిమిత్తం లేవీయులను పరమతండ్రి ఏర్పాటు చేసుకున్నాడు. వారంతా యవ్వనకాలంలో పరమతండ్రి సేవకొరకు ప్రత్యేకింపబడినవారు. 30 సం॥లనుండి 50 సం॥ల వరకూ ప్రాయము కలిగినవారు (సంఖ్యా 4:3, 23,30,34,39,43,47). వారు ప్రత్యేకింపబడిన యాజకులు. పరమతండ్రి పనికితప్ప వేరే పనికి నిర్ణయించబడినవారు కారు. వారిని నాలుగు భాగములుగా చేసి ప్రత్యక్షగుడారమునకు నాలుగు దిక్కులుగా పరమతండ్రి ఉంచమన్నాడు. మందిరమునకు సంబంధించిన అన్నిపనులు వారు మాత్రమే చెయ్యాలి. అన్యులెవరూ సమీపించరాదని ఆజ్ఞాపించబడినది (సంఖ్యా1:51,3:10,38) ఇక్కడ అన్యులంటే లేవీయులు కాని 11 గోత్రికులైన ఇశ్రాయేలీయులే: గనుక లేవీయులంటే చాలా ప్రత్యేకించబడినవారు. ఇశ్రాయేలు 11 గోత్రికులతో వీరు సమానులు కారు. (సంఖ్యా 1:47-49). ఇశ్రాయేలు 11 గోత్రముల వారిని పరమతండ్రి ఏవిధంగా ప్రత్యక్షగుడారము నాలుగు మూలలను ఉంచాడో ఇప్పుడు చూద్దాం.

**1. తూర్పు దిక్కున:** యూదా, ఇశ్శాఖారు, జెబూలూను సంఖ్యా 2:3-9
**2. దక్షిణ దిక్కున:** రూబేను, షిమ్యోను, గాదు సంఖ్యా 2:10-17
**3. పడమటి దిక్కున:** ఎఫ్రాయిము, మనష్షే, బెన్యామీను సంఖ్యా 2:18-24
**4. ఉత్తర దిక్కున:** దాను, అషేరు, నఫ్తాలి సంఖ్యా 2:25-31

అటులనే లేవీ గోత్రికులను కూడా నాలుగు భాగములుగా విడగొట్టి పరమతండ్రి ప్రత్యక్ష గుడారమునకు నాలుగు వైపుల ఉంచాడు.

**1. పడమటి దిక్కున:** గెర్షోనీయులు సంఖ్యా 3:23
**2. దక్షిణ దిక్కున:** కహాతు కుమారులు సంఖ్యా 3:29
**3. ఉత్తర దిక్కున:** మెరారీయులు సంఖ్యా 3:35
**4. తూర్పు దిక్కున:** మోషే, అహరోను, అహద్ నాయకులు సంఖ్యా 3:38

ఈ విధంగా ఒక పద్ధతిని పరమతండ్రి ప్రవేశపరచి ఎవరి బాధ్యతలు వారికి అప్పగించి తన సేవకు జరిగించుకున్నాడు. ఇక్కడ కూడా అనేకమంది తిరుగుబాటుదారులు తయారయ్యి లేవీయులతో పోల్చుకొని సేవ చేయడాన్ని సిద్ధపడి అన్యాగ్ని అర్పించి చావు కొనితెచ్చుకున్నారు. (సంఖ్యా 3:4) మోషే మీద తిరుగుబాటు చేసి ఒక స్త్రీ, బోధకురాలుగా ప్రవర్తించి కుష్ఠురోగం కొనితెచ్చుకుంది. (సంఖ్యా 10:12) అందరూ పరిశుద్ధులే, అందరూ యాజకులే అంటూ 250 మంది మోషేకు ఎదురు నిలిచి ప్రాణములతో పాతాళమునకు పోయారు. (సంఖ్యా 16:1-40) పరమతండ్రి సేవకులపై సణుగుకుని సమాజము తెగులుకు గురి అయ్యింది. (సంఖ్యా 16:41-50) రాను రాను పరిస్థితులు విషమించి లేవీయులు కాని వారంతా యాజకులు (దూడ) అయ్యారు. (1రాజులు 12:25-33) యాజకుడు కానీ ప్రతీవాడూ యాజకత్వం చేయడాన్ని బలులు అర్పించడానికి సాహసం చేసి పరమతండ్రి పట్ల దుర్మార్గంగా ప్రవర్తిస్తూ ఆయనకు వ్యతిరేకమైన పనులు చేస్తూ సామాన్య జనులను యాజక వృత్తికి పురికొల్పి సంఘాల్ని స్థాపించడం మొదలగునవి చేసారు. (1రాజులు 13:33, 12:31) సత్యము తెలుసుకొకుండా ప్రజలను అడ్డుకోవడం చేసారు (1రాజులు 12:25-32) ప్రత్యక్షగుడారములో సేవ చేయవలసిన లేవీయులు బ్రతకలేని పరిస్థితిలో కూటికోసం, గుడ్డకోసం, నీడకోసం ధనవంతుల పంచన చేరవలసిన అగత్యం ఏర్పడింది. (న్యాయాధి 17:7-13) ఆఖరికి సేవ చేయు లేవీయులకు అందవలసిన పాళ్ళు అందక పోవడం వల్ల జీవనం సాగక మందిరసేవ వదిలి పొలములకు పోయి పనులు చేసుకోవడం మొదలుపెట్టారు (నెహెమ్యా 13:10) లేవీయులు అంటే పరమతండ్రికి ఎంతో విలువైనవారు. (యెహెజ్కేలు 44:15-31) లేవీయులు అంటే పరమతండ్రికన్న ఎక్కువగా ఎవరిని ప్రేమించనివారు. తల్లితండ్రులను, అన్నదమ్ములను, రక్తసంభందులను, ఆఖరికి వారి కన్నబిడ్డలను కూడా పరమతండ్రికన్నా ఎక్కువగా ప్రేమించనివారు. (ద్వితి 33:9-10) పరమతండ్రికొరకు సహోదరులను, చెలికానులను, పొరుగువానిని సహితం చంపడానికి వెనుకాడనివారు. (నిర్గమ 32:26-28) అట్టివారు సహితం పరమతండ్రి వారికి అప్పగించిన పనిని అన్యులకు అప్పగించారు. (యెహెజ్కేలు 44:8) ఇశ్రాయేలీయులతో కలిసి విగ్రాహారాధన చేసారు. ఇశ్రాయేలీయుల పాపములో పాలిభాగస్తులయ్యారు. (యెహెజ్కేలు 44:10-13) కేవలం తిండికి ఆశించి ప్రజల చేత పాపముచేయించి వాళ్ళ పాపపరిహారార్ధ మాంసమును తిన్నారు. (హోషేయా 4:8) ఈవాక్యం రిఫరెన్సు బైబిల్‌లో చదవండి. అక్రమముగా లేవీయుల కార్యాక్రమములోనికి చొరబడి చావు కోరుకున్న వాళ్ళు కొందరైతే, రోగాలతో మొత్తబడినవారు మరికొందరున్నారు. యాజకులుగా జీవిస్తూ పరమతండ్రి చిత్తము నెరుగక శాపగ్రస్తులై (1 సమూ. 2:12,13,4:22) చనిపోయినవారున్నారు. పరమతండ్రి యాజకులు చెడిపోవడం చూసి ప్రవక్తలను పంపించి బాగుచేయాలని ప్రయత్నిస్తే యాజకులే ప్రవక్తలను చంపించారు. ప్రవక్తలపై చెడు మాట్లాడుచూ వారిని నిందించువారు. ఇలా మొత్తం వ్యవస్ధ అంతా చెడిపోయింది. పరమతండ్రి కూడా తన మందిరాలు వదిలి వెళ్ళిపోవడం జరిగింది. సాతాను ఆవిధంగా పరమతండ్రి చిత్తాన్ని పూర్తిగా ధ్వంసం చేయించింది. దీనికి ఒక్కరు కారకులు కారు. అందరూ కారకులే. ఎవరిస్ధానంలో వారు సరిగ్గా నిలబడకపోవడమే దీనికి గల కారణము. కాలము సంపూర్ణమైనప్పుడు యషువ మెస్సీయ జన్మించడం, 12 మంది శిష్యులను ఏర్పరచుకోవడం జరిగింది. $3^{1/2}$ సం॥లు ఆయన సేవచేసి శిష్యులకు పని అప్పగించి వెళ్ళాడు. ఇప్పుడు ఏమిజరుగుచున్నది? పాతనిబంధన కాలములో ఏమైతే జరిగిందో అదే ఇప్పుడు జరుగుతుంది. ఇప్పుడు అందరూ బోధకులే ఎవరి ఇష్టం వారిది. ఏవరి సేవ వారిది. ఎవరి బైబిలు వారిది. ఎవరి ఉపదేశములు వారివి. నిజమైన సేవకులు ఎవరో, డమ్మీ సేవకులెవరో తెలియని పరిస్థితి. కారణం అంతా అక్రమము. సేవకులు చేయవలసిన పనిని సేవకులు కాని వాళ్ళు చేస్తున్నారు. సత్యమును మూసి అబద్దములను సత్యమని బోధిస్తున్నారు. ఏది నిజమో ఏది అబద్ధమో తెలుసుకోలేని స్థితిలో విశ్వాసులున్నారు. కొన్ని వందల డినామినేషన్‌లు మిషన్‌లు తయారయిపోయాయి. అనేకులైన అబద్ధబోధకులు ప్రజలలో ఉన్నారు. ఒక్కొక్కరు ఒక్కోరకం మోసం చేస్తూ ఏర్పాటు చేయబడినవారిని సహితం కలవరపరుస్తున్నారు. వాక్యం తెలిసినవారు తప్ప మిగతావారంతా మోసపోవుచూనే ఉన్నారు. అక్రమస్తులు పరమతండ్రి పొలములో చొరబడ్డారు న్యాయమునకు, సత్యమునకు ఆటంకం కలుగుచున్నది. అయినా తండ్రి తన సేవకుల ద్వారా సత్యమును సత్యముగానే ఋజువు చేయుచున్నాడు. ఆయన గొఱ్ఱెలు ఆయన స్వరమును వినుచూనే ఉన్నవి. మెస్సీయ శరీరము (సమాజము) క్షేమాభివృద్ధి చెందుటకును పరిచర్యధర్మము జరుగుటకును ఆయన కొందరిని అపోస్తలులు గాను, కొందరిని ప్రవక్తలుగాను, కొందరిని సువార్తికులు గాను, కొందరిని కాపరులు గాను, ఉపదేశకులు గాను నియమించెను (ఎఫెసీ 4:13) గనుక మెస్సీయ సమాజమును కాయుటకు పరమతండ్రి అయిదుగురుని ఏర్పాటు చేసుకున్నాడు ఈ అయిదుగురు ( అపోస్తలులు, ప్రవక్తలు , సువార్తికులు, కాపరులు, ఉపదేశకులు) పరలోకానికి వెళ్ళే విశ్వాసులకు తెలుస్తాది. వీరు నూటికి నూరు శాతం పరమతండ్రి పై ఆనుకుని సేవ చేస్తూ ఉంటారు. ప్రతీ లేఖనమునకు సమర్ధవంతంగా బోధింప శక్తిమంతులై ఉంటారు. ఎవడు ఏతప్పుడు బోధను బోధించిన దానికి వాక్యంతో ఖండింప సమర్ధులై ఉంటారు. వారి బోధ అధికారముతో నిండి ఉంటుంది. వారు సంస్థలలోను లేక బ్రతుకు దెరువుకొరకు ఉద్యోగం చేస్తూ ఉండరు. నూటికి నూరు శాతం పరమతండ్రిపై ఆనుకొని సువార్త చేస్తూ ఉంటారు. ఏడినామినేషన్ వాడినైనా వాక్యంతో ఓడింప సమర్ధులై ఉంటారు. అవసరమైతే పరమతండ్రికొరకు చావడానికి కూడా వెనుకాడరు. అ॥కార్య 21:13 రక్త సంబంధుల కన్న ఆత్మసంబంధులకే ఎక్కువ ప్రాముఖ్యత ఇస్తారు మత్తయి 12:46-50. మోమాటం ముఖస్తుతి లేనివారై ఉంటారు మత్తయి 22:15. మెస్సీయనే గురిగా పెట్టుకుంటారు. గనుక ఒకానొకనాటికి మెస్సీయవలెనే బోధించగలరు. (మత్తయి 10:24,25) మెస్సీయవలె లోకానికి బాహటంగా బోధిస్తారు యోహాను 18:20,21 దొంగ బోధలు చేయరు రహస్యబ్రతుకు రహస్య కార్యకలాపాలు చేయరు. గనుక మీరు అనుసరించే బోధకులు ఎలా ఉన్నారు? అనునది మీరు ప్రశ్నించుకోవాలి. సత్యమైన బోధకునివద్ద మీరు లేకపోతే మీరు పరలోకం చేరరు. గనుక నేడైనా మీబోధకులను మీరు పరిక్షించుకుని నిత్యజీవమునకు నడిపే పరమతండ్రిచే ఏర్పాటు చేయబడినవారిని వెంబడించండి.

**పత్రిక సర్క్యులేషన్ మేనేజర్లు కావలెను:**

బైబిలు సత్యములు ఎరుగని ఏజెన్సీ ఏరియాలైన నర్సీపట్నం, చింతపల్లి, పాడేరు, అరకులోయ, సీలేరు, డొంకరాయి,మోతుగూడెం, చింతూరు, భద్రాచలం వరకూ గల బెల్ట్ నందు సత్యమునకై పోరాటం పత్రికను సర్క్యులేట్ చేయునిమిత్తము మేనేజర్లు కావలెను. తగిన పారితోషకం ఇవ్వబడును. పూర్తి వివరములకు వెంటనే ఈ క్రింది ఫోన్ నెంబరుకు సంప్రదించండి. **9849385038**

**ఎడిటర్స్ నోట్**

ప్రియ పాఠకులకు షలోం. పత్రికను ఉచితముగా పొందుచున్నవారు తప్పక సం॥ర చందా రూ. 50/- పంపి పత్రికను పొందవలెను. ఈ పరిచర్య ద్వారా బాప్తీస్మము పొంది సత్యములో నడచుచున్న సహోదరులు తప్పక పత్రిక పరిచర్యకై సహకరించవలెను. దూరముగా ఉన్న సహోదరులు తమ కానుకలను ఆన్‌లైన్ ద్వారా పంపించవచ్చును.

Isaac E. Kusuma
Online A/C No. **10664134898**
Bank Code 0885
SBI, Narsapur, W.G.Dt

Isaac E. Kusuma
Online A/C No.**ABG 0361-10025001028**
Bank Code 0361
Andhra Bank, Malikipuram

# యషువ మెస్సీయ శరీరము ధరించిన ఎలోహీం

యషువ మెస్సీయ ఆరాధనకు పాత్రుడు, యషువ మెస్సీయ శరీరము ధరించిన ఎలోహీం. గనుకనే యషువ మెస్సీయను ఆరాదించిరి. ఆయన ఆరాధనకు యోగ్యుడని ఈ క్రింది వచనములు ఋజువు చేయుచున్నవి. మ్రొక్కిరి అని తెలుగులో వ్రాయబడినది గాని ఇంగ్లీషులో worshipped అని వ్రాయబడింది.

1. మత్తయి 2:11 ఆ శిశువును చూచి, సాగిలపడి, ఆయనను పూజించి (ఆరాధించి) worshipped
2. మత్తయి 8:2 ఇదిగో కుష్ఠరోగి వచ్చి ఆయనకు మ్రొక్కి (ఆరాధించి) worshipped
3. మత్తయి14:33 నీవు నిజముగా ఎలోహీం కుమారుడవని చెప్పి ఆయనకు మ్రొక్కిరి (ఆరాధించిరి) worshipped
4. మత్తయి 28:9 ఆయన పాదములు పట్టుకొని ఆయనను మ్రొక్కగా (ఆరాదించగా) worshipped
5. మత్తయి 28:17 వారు ఆయనను చూచి ఆయనకు మ్రొక్కిరి (ఆరాధించిరి) worshipped
6. మార్కు 5:6 వాడు దూరమునుండి యషువను చూచి, పరుగెత్తుకొని వచ్చి ఆయనకు నమస్కారము చేసి (ఆరాధన చేసి) worshipped
7. లూకా 24:52 వారు ఆయనకు నమస్కారము చేసి (ఆరాధన చేసి) worshipped
8. యోహాను 9:38 నేను విశ్వసించుచున్నానని చెప్పి ఆయనకు మ్రొక్కెను (ఆరాధించెను) worshipped
9. హెబ్రీ 1:6 ఎలోహీం దూతలందరూ ఆయనకు నమస్కారము (ఆరాధన) worshipped చేయవలెనని చెప్పుచున్నారు.
10. ప్రకటన 5:14 ఆ పెద్దలు సాగిలపడి నమస్కారము (ఆరాధన) worshipped చేసిరి.

మత్తయి 9:18, 15:25, 18:26, మార్కు 15:19, అ॥కార్య 16:14, 18:7

యషువ మెస్సీయ 100% మానవుడు + 100% ఎలోహీం. ఆయనలో రెండు (మానవత్వ+దైవత్వ) లక్షణములు కలవు. అవి అర్థమైతేనే గాని యషువ మెస్సీయ శరీరం ధరించిన ఎలోహీం అనే మర్మం అర్థం కాదు. మానవునిగా, ఎలోహీంగా యషువ మెస్సీయ ఎలా పనిచేసాడో చూద్దామా!

| మానవునిగా | ఎలోహీంగా |
|---|---|
| 1. అబ్రహాము కుమారునిగా పిలవబడ్డాడు మత్తయి 1:2 | అబ్రహాముకన్నా ముదున్నావాడు. అబ్రహాము, ఇస్సాకు యాకోబుల ఎలోహీం. యోహాను 8:58 |
| 2 దావీదు కుమారుడుగా పిలవబడ్డాడు | దావీదుకు సర్వాధికారి కీర్తనలు 110:1 |
| 3.మనుష్యకుమారునిగా పిలువబడ్డాడు | మనుష్యకుమారుని పోలిన ఎలోహీం యైయున్నాడు |
| 4.దేవుని కుమారునిగా పిలువబడ్డాడు | శరీరంలో ఎలోహీం |
| 5.చదువుకొనని వానిగా ఉన్నాడు | గొప్ప పాండిత్యము గలవాడు.... |
| 6.ఆకారమందే మనుష్యుడు | అంతరంగంలో ఎలోహీం |
| 7. ఆకలి గొనెను మత్తయి 4:2 | అనేకమందికి ఆకలి తీర్చెను ఆయనే జీవాహారము. |
| 8. దప్పిక గొనెను యోహాను 4:7 | అనేక మందికి ఆత్మీయ దాహము తీర్చెను యోహాను4:10, 13,14, 7:37-39 |
| 9. నిద్రించెను మార్కు 4:38 | సముద్రమును గాలిని గద్దించి నిమ్మళింపజేసెను మార్కు 4:39-41 |
| 10. ఏడ్చెను యోహాను 11:35 | చనిపోయిన లాజరును లేపెను యోహాను 11:25,43,44 |
| 11. ప్రార్థించెను | ఆయన నామమున ఏది అడిగిన చేయువాడు. యోహాను 14:14 |
| 12. అపహసించబడెను | ఆశ్చర్యపడి పొగడబడెను |
| 13. ఏమీ ఎరుగని వానిలా ఉండెను | సమస్తమును ఎరిగినవాడు |
| 14. శరీరమును బట్టి యూదులలో పుట్టెను | చావు పుట్టుకలు లేనివాడు |
| 15. వంశావళి కలిగినవాడు | వంశావళి లేనివాడు హెబ్రీ 7:1-3,6 |
| 16. సున్నతి పొందినవాడు | సున్నతితో సంబంధం లేనివాడు |
| 17. పండుగలను ఆచరించినవాడు | పండుగలను ప్రవేశపెట్టినవాడు లేవీ 23వ అధ్యాయం |
| 18. ధర్మశాస్త్ర ప్రకారం జీవించినవాడు | ధర్మశాస్త్రముతో సంబంధం లేనివాడు 1తిమోతి 1:8-11, యోహాను 10:34 |
| 19. ధర్మశాస్త్రమును జ్ఞాపకం చేసినవాడు మత్తయి 5:21,27,33,38,43 | ధర్మశాస్త్రమును మార్చినవాడు మత్తయి 5:22,28,34,39,44 |
| 20. భయపడి,దాగి పారిపోయెను | నేనే ఆయనను అని చెప్పి మనుష్యులను క్రింద పడవేసెను |
| 21. సముద్రతీరమున నడిచెను | సముద్రముపై నడిచెను |
| 22. మనుష్యుడుగా కనబడెను యోహాను 19:5 | బలవంతుడైన ఎలోహీం, నిత్యుడగు తండ్రి యెషయా 9:6 |
| 23. 50 సం॥లు కూడా కలిగి లేదు | ఆదియు అంతము ఈయనే |
| 24. ఆదినమును గూర్చి, ఆగడియ గూర్చి ఎరుగడు మార్కు 13:32 | సమస్తమూ ఎరిగినవాడు యోహాను 21:15-17, కొలస్సీ 2:3-10 |
| 25. వడ్లవాని కుమారుడుగా కనబడెను మత్తయి 13:55 | ఎలోహీం కుమారుడుగా వచ్చినట్లు చూడగలము లూకా 1:33 |
| 26. మరణించెను యోహాను 19:33 | జీవాధిపతి మరణ పుట్టుకలు లేనివాడు |
| 27. పన్ను చెల్లించినవాడు మత్తయి 17:24-27 | పన్ను చెల్లించనక్కరలేనివాడు/పన్ను తీసుకొనువాడు మత్తయి 17:26 |
| 28. దయ్యము పట్టినవాడనిరి యోహాను 7:19,8:49 | దయ్యములను వెళ్ళగొట్టినవాడు మార్కు 9:25 |
| 29. మోసపుచ్చు వాడనిరి యోహాను7:12 | ఏదోషము లేనివాడు |
| 30. పాపిగా కనిపించాడు యోహాను 9:16,24,25 | పాపము లేనివాడు |
| 31. వెఱ్ఱివానిగా కనిపించాడు యోహాను10:20 | మహాజ్ఞాని కొలస్సీ 2:3 |
| 32. తిండిబోతు, మద్యపాని, సుంకరులకును పాపులకును స్నేహితుడని అన్నారు మత్త11:19 | పరలోకము నుండి వచ్చిన జీవాహారం యోహాను 6:35, దప్పిక తీర్చువాడు యోహాను 7:37 |
| 33. పాపుల స్నేహితుడు మత్తయి 11:19 | పాపుల రక్షకుడు 1తిమోతి 1:15 |
| 34. బెయెల్జెబూలు వలన దయ్యములను వెళ్ళ గొట్టుచున్నాడనిరి మత్తయి 12:24 | ఎలోహీం వ్రేలితో దయ్యములను వెళ్ళగొట్టుట మత్తయి 12:28 |
| 35. మూర్ఖులైన యూదులు (స్వకీయులు), సహోదరులు అంగీకరించలేదు యోహాను 1:11,7:5 | లోకము నమ్మింది ఆయన వెంట పోయింది. 1తిమోతి 3:16 |
| 36. యావె దూషణ చేయుచున్నాడనిరి మార్కు2:7 | పాపములను క్షమించు ఎలోహీం మార్కు 2:10 |
| 37. చంపబడి సమాధి చేయబడెను మార్కు 15:46 | చావు - పుట్టుకలు లేనివాడు |
| 38. లోకపాపములను తీసివేయు ఎలోహీం గొఱ్ఱెపిల్ల యోహాను 1:29 | లోకమును ఎంతో ప్రేమించి రక్షించు ఎలోహీం యోహాను 3:16,12:19 |
| 39. 30 వెండి రూకలకు అమ్మబడెను మత్తయి 26:15 | స్వరక్తముతో సమాజమును కొనిన ఎలోహీం అ॥కార్య 20:28 |
| 40. ప్రవక్తగా కనబడ్డాడు యోహాను 4:19 | మెస్సీయ యోహాను 4:26 |
| 41. పంపబడిన వాడుగా కనబడాడు గలతీ 4:4 | శరీరం ధరించి దిగివచ్చినవాడు 1తిమోతి3:16 యోహాను 3:13 |
| 42. పాపిగా పిలువ బడ్డాడు | పాపికాడు యోహాను 8:46 |
| 43. శిక్ష అమలు చేయువాడుగా కనబడ్డాడు యోహాను 8:3-5 | శిక్ష విధింపని తండ్రి యోహాను 8:10,11 |
| 44. యోహాను కన్నా వెనుక పుట్టాడు | యోహాను కన్నా ముందున్నవాడు యోహాను1:15,26,30 |
| 45. మనుష్య కుమారునిగా కనబడుతున్నాడు | శరీరం ధరించిన యావె యోహాను 1:51 |
| 46. ప్రవక్తగా కనబడుతున్నాడు | తండ్రి యోహాను 6ః62,63 |
| 47. నేరం మోపబడిన వానిలా నిలబడ్డాడు | ఏదోషము లేనివాడని ఋజువు అవుతుంది. |
| 48. అక్రమకారుడు అని అన్నారు | ఏతప్పు లేనివానిగా ఋజువు అయ్యింది |
| 49. శరీరం మాత్రమే దృశ్యమైనది | అదృశ్యంగా ఎలోహీం |
| 50. బలి అయ్యాడు | బలిని అంగీకరించాడు. |

# టీజింగ్ డెవిల్స్

దయ్యపు లక్షణాలలో "టీజింగ్" ఒక లక్షణము. టీజింగ్ అంటే గేలి, ఎగతాళి చేయడం, పరిహసించడం, ఎదుటివాని గౌరవాన్ని కించపర్చడం లేక హీనపరచడం, శాడిస్ట్‌ల్లా ఎదుటి వారు బాధపడుతుంటే వారిని చూసి వీరు పల్లు ఇకిలించడం, అపహాస్యం చేయడం, కోపం పుట్టించడం, (దీనినే వీరు ఉడుకుమోతుతనం అంటారు) నిక్‌నేమ్స్ పెట్టడం, పకపక పల్లు ఇకిలించడం, అనందించడం మొ॥గు నవి చేయడమే. ఇది 100%డెవిల్ లక్షణములు.

బైబిల్లో ఇలా చేసిన వారిలో

| | |
|---|---|
| మికాలు దావీదుని చేసింది............. | 2 సమూ 6:20 |
| బాలురు ఎలీషాని చేసారు................ | 2 రాజు 2:23 |
| యూదులు పౌలుని చేసారు ............. | అ॥కార్య 17:32,33 |
| యిర్మీయాని సిద్కియా చేసాడు............ | 2దిన 36:16 |
| రబ్షాకే హిజ్కియాని చేసాడు........... | యెషయా 37:22-28 |
| మెస్సీయను అనేకులు చేసారు............ | మత్తయి27:40-42, మార్కు 15:29-32 లూకా 23:35-37 |

టీజింగ్ చాలా త్రిల్లింగ్ గానే ఉంటాది. దయ్యపు ఆత్మ ఉన్నవాళ్ళకి యిది చాలా ఆనందం. దీని రియాక్షన్ మాత్రం చాలా కిల్లింగ్‌గా ఉంటాదనే సంగతి ఈ నీతిహీనులకి తెలియదు.పల్లు ఇకిలించడం, పురుషుల్ని రెచ్చగొట్టడం, దెబ్బలాటకి చాతి మీద చాతి కలపడం, పురుషుడితో సవాలు చెయ్యడం, చిటికెలు వెయ్యడం, తొడలు కొట్టడం , వాళ్ళ వాదాన్ని నెగ్గించకోవడాన్ని ఏ నీచానికైనా దిగ జారిపోవడం, ఎదుటి వాళ్ళని తిట్టడం, వాళ్ళ చేత తిరగేసి తిట్టించుకోవడం లేక తన్నించుకోవడం వీళ్ళకి అలవాటు. ఇవి ఈ టీజింగ్ డెవిల్ లక్షణాలు.

కాలేజి స్టుడెంట్స్ ఆడపిల్లల్ని టీజింగ్ చేస్తుంటారు. అది చాలా నీచమైన కార్యం అలాగు

ఆడపిల్లలు మగవాళ్ళని ఆటపట్టిస్తూ టీజింగ్ చేస్తూంటారు. ఇదీ నీచమైన కార్యమే. ఈ టీజింగ్ వలన అనేక మంది చనిపోయినవారు, తన్నులు తినిన సంఘటనలు కూడా లేక పోలేదు.

ఈ టీజింగ్ లక్షణం లోకల్ గాళ్ళకన్న పరలోక సంబందులం అని చెప్పుకునే పెంట రకాలు చేయడం మరీ శోచనీయం. ప్రేమికులు, భర్త భార్య టీజ్ చేసుకోవడం అది వేరు, మనసుని కోయడం, హృదయాన్ని గాయపర్చడం, పదిమందిలో పెట్టి గాలి తీయడం వలన ప్రేమ పుట్టదు. అసహ్యానికి, శాపానికి గురి అవ్వుతారు. చూడండి.

1. దావీదుని గేళి చేసిన మీకాలు ఏమయ్యిందో 2 సమూ6:21,22 (టీజ్ చేయబడిన దావీదు ఘనుడయ్యాడు. మీకాలు మాత్రం శపించబడి గొడ్రాలు అయ్యింది)

2. ఎలీషాని గేళి చేసిన బాలురు ఏమయ్యారో చదవండి 2రాజులు 2:24(పల్లు ఇకిలింపు రోత కేకలతో చావుగా మారింది)

3. సౌలు జ్ఞాని గనుక ఈ మూర్ఖులైన యూదులు బజారు రకాలుగాను, థర్డ్‌క్లాస్ గాళ్ళుగా ఉన్నారు. గనుక నోరు మూసుకొని పోవడమే మంచిదని వాళ్ల మధ్యనుండి వెళ్ళి పోయాడు. అ॥కార్య 17:33

4. హిజ్కియాని పరిహసించిన వాడ్ని గాలం వేసి ఎలోహీం ఒక త్రొక్కు తొక్కాడు. యెషయా 37:29

5. యిర్మీయాని గేళి చేసిన సిద్కియా రాజ్యనివాసులను నివారింప శక్యము కాని కోపముతో పచ్చడి, పచ్చడి చేసాడు. 2దిన 36:17

టీజింగ్ చేయుచున్న ఓ సహోదరుడా! ఓ సహోదరి, నీకు కూడా యిలాంటిది ఏమైనా కావాలా? నీ సంబరం సంతాపంగా మారక ముందే, నీ ముఖం చట్నీ అవ్వక ముందే, నీనవ్వు ఏడుపుగా మారక ముందే, ఆ టీజింగ్ లక్షణాలు మానుకో. అది పరిశుద్ధాత్మ కార్యం కాదని, భ్రమపరచూ ఆత్మ అని గుర్తెరుగు. సంసారి వ్యభిచారిలా ఆనందించకూడదు. దైవికంగా ఉండేవాళ్ళు దయ్యాలుగా పల్లు ఇకిలించకూడదు. నీతిహీనమైన పనులు చేసి చీవాట్లు చెప్పుదెబ్బలు తినకూడదు. నీవు ఏమిటో నీ స్ధానం ఎమిటో? గుర్తెరిగి ప్రవర్తించడం నేర్చుకో. రెచ్చ గొట్టడం నీలక్షణం అయ్యితే, వాక్యంతో చావగొట్టడం, చావబాదడం ఎలోహీం లక్షణం.

# సంక్రమించిన పాపములు

పాపము వలన వచ్చు జీతము మరణమనీ బైబిలు చదివే అందరికి తెలిసినదే.పాపములు ఎలా సంక్రమించాయో బైబిలు నుండే చూద్దాం!

**1. ఆదాము అవ్వలనుండి సంక్రమించిన పాపము:-** రోమా 5:12-19, 1కొరింధి 15:45-49, యోబు 31:33, యెషయా 43:27, 1తిమోతి 2:13-15, ఆది 3:17-20 ఈ యొక్క పాపము అవిధేయత తిరుగుబాటుతనము తీసివేయుటకే యషువ మెస్సీయ కడపటి ఆదాముగా పుట్టి మనకు ఆత్మీయ జీవితం అనుగ్రహించాడు. ఆదాము ద్వారా సంక్రమించిన పాపమునకు విరుగుడు కడపటి ఆదాము అయిన యషువ మెస్సీయ్యే.

**2. తల్లిదండ్రులనుండి సంక్రమించిన పాపము:-** చాలా మంది పితరులు యావెను ఆయన ఆజ్ఞలను కట్టడలను వదిలి వాళ్ళ సొంత అభిప్రాయాలతోను, మూఢత్వపు భక్తితోను మూర్ఖత్వపు మలినముతోను జీవిస్తూ ఉంటారు. యావెకి విరోధులై శాపగ్రస్తులై జీవిస్తారు. వారి శాపమే వారి పిల్లలమీద వారి సంతానం మీద ఉంటుంది. ఉదా. 2రాజులు 5:27 చదవండి. నయమాను కుష్టుకలిగిన కుష్ఠు గెహాజికి సర్వకాలము అంటిఉంది. ఇలాంటి పాపమునుండి బయటకు రావాలంటే తల్లి దండ్రులు నడిచిన తప్పుడుదారిలో పిల్లలు నడువకూడదు. యెహెజ్కేలు 20:18, 18:4,14,20 అందువలననే బైబిల్లోని భక్తులు వారి పితరుల పాపములను ఒప్పుకుని వారిని కరుణించమని వేడుకొనిన సన్నివేశములను మనము చూడగలం.

**3.బోధకులనుండి సంక్రమించిన పాపము:-** సహవాసం కోసమని సమాజాలకు సభలకు పరుగెత్తి దురాభిమానముతో బోధకులను ప్రేమించేసి (వాక్యాన్ని త్రోసేసి) ఉంపుడు బోధకులను (2రాజులు 3:13, హోషేయ 8:4) అనుకూల బోధకులను (2తిమోతి 4:3,4)వెంబడించుట బట్టి తెచ్చుకున్న పాపము వలన గ్రుడ్డివారు అవుతున్నారు. గుంటల్లో పడియున్నారు. వాళ్ళ బోధకులతో అగ్నిగుండానికి నాశనానికి సిద్ధపడుతున్నారు. ఈ వాక్యాలు చదవండి. విలా.4:13,14, మత్తయి 15:14, యిర్మీయా 15:16,20:6, యెషయా 29:10, యిర్మీయా 50:6, యెషయా 9:16, దైవజనున్ని ప్రేమించి ఎలోహీంని ద్వేషించడం దయ్యపు పని సంఖ్యా 22:6, 1సమూ.8:7 దేవాలయాన్ని ప్రేమించి దైవత్వాన్ని దూషించడం అది సాతాను పని యిర్మీయా 7:4-16. మాకొక నాయకుడున్నాడు. మాకొక పాస్టరు గారున్నారు. మాకు భవిష్యత్తు చెప్పే సోదెగాడు ఉన్నాడు. మాకు ప్రవచనాలు చెప్పె అమ్మగారు ఉంది. మాసంస్థకి ఒక సూపర్‌వైజరు ఉన్నాడు. మేమంతా చందాలు ఇచ్చి బోధచేయడానికి ఒకడ్ని ఉంచుకున్నాం అనే సోదెమాటలు మానేసి, చెపుతున్న వాక్యం బైబిల్లో అలాగున్నదో లేదో పరిశీలించడం నేర్చుకొండి అ॥కార్య 17:11. డినామినేషన్‌లన్ని దయ్యానివే. ఏడినామినేషన్ పరలోకం వెళ్ళదు. దురాభిమాన పాపము నుండి బయటకు వచ్చి వాక్యాన్ని పరిశీలించడం నేర్చుకోండి కీర్తనలు 119:74-79. విశ్వాస విషయములో మోమాటం ముఖస్తుతి పనికిరాదు. యాకోబు 2:1 రెవరెండులు, రైట్ రెవరెండ్లు, మోస్టు రెవరెండ్లు సాతాను బోధకులు అని మీకు తెలుసా? ఎవరీ రెవరెండ్లు? అనే కరపత్రం కొరకై వ్రాయండి. ఈనిజాలు తెలుసుకొని ప్రియురాలిగా (పరమ 3:1-4,5:7) సంఘ కట్లనుండి బోధకుల తప్పుడు బోధలనుండి డినామినేషన్‌ల బంధకాలనుండి బయటకు రండి.

**4.స్వకీయ దురాశవలన సంక్రమించిన పాపము:-** నేను నా అనే అహంకారము, గర్వం శారీరక బలాన్ని బట్టి, మానసిక జ్ఞానాన్ని బట్టి, ఈ లోక ధనాన్ని బట్టి, అంతస్తుని బట్టి, విర్రవీగటం మొ॥గు వాటివలన వచ్చే పాపములు మరీ భయంకరం. బలము పరమతండ్రిది. కీర్తనలు 62:11, యిర్మీయా 9:23 ఒక రాత్రిలో మూడు భారీ విరోచనములైతే విర్రవీగే బాడీ బిల్డరు ఖాళీ. ధనాన్ని బట్టి విర్రవీగే వారి స్థితి యావె ఉగ్రతతో ఖాళీ యెహెజ్కేలు 7:19, జెఫన్యా 1:19. జ్ఞానాన్ని బట్టి విర్రవీగితే వ్యర్ధులుగా మిగిలిపోతారు. యెషయా 29:14 ఇక అందాన్ని బట్టి విర్రవీగితే అది అడవి పువ్వులాంటిది త్వరలోనే వాడిపోయేది. (గ్యాస్ పొయ్యిలో పెడితే మాడిపోతాది జాగ్రత్త) అది శాశ్వతం కాదు. బలముందికదా అని బలహీనులను అదును చూసికొడితే బలహీనులను బలపర్చి తిరిగి తన్నించే ఏర్పాటు కూడా యావె చేయగలడు. చేసాడు. ద్వితి 25:17-19 , నిర్గమ 17:14 1సమూ15:2,3 దోచుకోవడం అలవాటు చేసుకొంటే దోపిడిగాడ్ని పంపి నీవు దోచుకున్న దానిని వడ్డీతో సహా దోచేస్తాడు. యెషయా 33:1 కుక్క కాటుకు చెప్పుదెబ్బ, దెబ్బకు దెబ్బ సూత్రాలు నిన్ను సృష్టించిన సృష్టికర్తకు తెలుసు. గనుక నేను సో అండ్ సో అని చెప్పకు. యెషయా 47:5-15 ఒక్క నిమిషములో నీవు ఎగిరిపోతావు. మనుష్యులు మీకేమి చేయవలెనని కోరుకుందురో అలాగుననే మీరును వారికి చేయుడని మత్తయి 7:12 చెప్పిన వాక్యం గుర్తుంచుకుని జీవిస్తే చాలా వరకు ఈ పాపములను అరికట్టుకోవచ్చు. ఆదాము ద్వారా, తల్లిదండ్రుల ద్వారా, సహవాస బోధకుల దోషాలు ద్వారా, స్వకీయదురాశలు ద్వారా వచ్చే పాపాలు ఎలా అరికట్టుకోవాలో వాక్యం మనకు వివరిస్తుంది అట్టి జీవితం జీవించుటకు మనలను మనమే పరీక్షించుకొందుము గాక. మనమైతే ఇక **పాపములను జ్ఞాపకముచేసుకోకూడదు ఇక పాపం చేయకూడదు.**

1.వారి పాపములన్నిటిని సముద్రపు అగాధములలో నీవు పడవేతువు.... మీకా 7:19

2. వారి పాపములను ఇకను ఎన్నడును జ్ఞాపకము చేసుకొనను.... హెబ్రీ 8:12, యిర్మీయా 31:34

3. తన పూర్వపాపములకు శుద్ధికలిగిన సంగతి మర్చిపోరాదు...... 2పేతురు 1:9

4. నేను నీ పాపములను జ్ఞాపకము చేసుకొనను......యెషయా 43:25

5. ఇక పాపము చేయకుము .....యెషయా 5:14,8:11

6. యషువ రక్తము ప్రతీ పాపమునుండి మనలను పవిత్రులుగా చేయును.....1యోహాను 1:7

7. ఇదిగో లోకపాపములను మోసికొనిపోవు (నీ పాపమెంత) ఎలోహీం గొఱ్ఱెపిల్ల ...యోహాను 1:29

# పెండ్లి చేసుకోకుండా తిరుగుచున్న అబద్ధబోధకులు

వివాహము అన్ని విషయములలో ఘనమైనది. హెబ్రి 13:4 అని బైబిలు చెపుతున్నా వివాహము కన్నా ఎలోహీం సేవే ముఖ్యమని సువార్త చేయడానికి సమర్పించుకొని సర్వము వదులుకొని లూకా 18:28-30 మార్కు 28:30 యావె రాజ్యం కోసం నపుంసకులుగా ఉండటానికి ఇష్టపడి మత్తయి 19:12 పెండ్లి చేసుకుంటే సర్వాధికారిని సంతోషపరచలేమని (1కొరిం 1:34) ఆస్తులమ్మి అపోస్తలుల పాదముల దగ్గర పెట్టి అ॥కార్య 4:34 సర్వము ఆయనే ఆయన కొరకే నేను ఉన్నది అని చెప్పుకుంటూ పెండ్లి నిషేదించి సువార్తకి వచ్చారు వీరు. అయితే వీరి మాటలు, వీరి వేషం, వీరి బోధ, వీరి క్రియలు, వీరు చూపించే రిఫరెన్సులు బైబిలుకి సరిపోవుచున్నవా లేవా అని పరిశీలించవలసిన బాధ్యత సత్యాన్వేషిగా ప్రతీ ఒక్కరిపై ఉంది. ఇప్పుడు బైబిలు నుండి చూద్దాం.

**1.ప్రత్యేకత కోసం ప్రత్యేక డ్రస్:-** తెల్లని వస్త్రములంటూ ప్రకటన 7:9 వచనం చూపిస్తారు. వీరి చేతిలో ఖర్జూరపుమట్టలు ఏవి? వస్త్రాలకేమో శారీరక అర్ధం, ఖర్జూరపు మట్టలకేమో ఆత్మీయ అర్ధమా? పెండ్లి వస్త్రం, ఉల్లాస వస్త్రం, రక్షణ వస్త్రం, నీతి వస్త్రం మొ॥గు నవన్నీ ఆత్మీయ వస్త్రాలైతే తెల్లని వస్త్రాలు మాత్రం శారీరక వస్త్రములా? లేక సాతాను తాలుక వారము మేమేనని 2కొరిం 11:14,15 వేషానికి ధరించడమా?

**2. సర్వము వదిలేయడం అంటే?:-** తల్లిదండ్రులను, అన్నదమ్ములను, అక్కచెల్లెండ్రను, బంధుమిత్రులను, భార్యబిడ్డలను వదిలేసి మిషనులో దూరడము వాక్యానుసారమేనా? ఇది మెస్సీయ మాదిరా? మెస్సీయ బాధ్యతలు విస్మరించినవాడా? తన తల్లి అయిన మరియ విషయములో బాధ్యత కలిగిలేడా? యోహాను 19:25,26,27. తన తల్లిని తన శిష్యునికి అప్పగించాడు. ఆయన తల్లిదండ్రులకన్న వాక్యానికి ఆయన వచ్చిన పనికి ప్రాముఖ్యత ఇచ్చాడే గాని తల్లితండ్రులను వదిలేయలేదు. లూకా 2:48,49, మత్తయి 12:4 లేవీయులైన యాజకులు యావెకు ఇచ్చినంత ప్రాముఖ్యత శరీరసంబందులకు ఇవ్వలేదు. నిర్గ 32:27,28 ద్వితి 33:8-10 అంతేగాని యావె 10 ఆజ్ఞలలో నీవు దీర్ఘాష్మతుడవగునట్లు నీతల్లిని నీతండ్రిని సన్మానించుము అను 5వ ఆజ్ఞ ఆయన అతిక్రమించలేదు. ఇది వీరికి అర్ధం కాలేదు. మనం చెప్పిన అది వారికెక్కదు.

**3.స్త్రీ సాంగత్యమున అపవిత్రులు కానివారు ప్రకటన 14:4:-** బ్రహ్మచారులు/పరలోకరాజ్య నపుంసకులు/ స్త్రీలకు చాలా దూరంగా ఉండాలి. కానీ వీరి పరిచర్య అంతా స్త్రీలతోనే: మెస్సీయ 12 మంది మగ శిష్యులను ఎన్నుకున్నాడే గాని స్త్రీలను సువార్తకు ఎన్నుకోలేదు. ఏ స్త్రీని సువార్త భారముతో పంపలేదు. మరి వీరేంటి ఇద్దరేసి స్త్రీలను వేసుకుని తిరగడం? 1కొరింధి 7:36-38 వచనాలు చూపించి ఆడ పిల్లలను సువార్తకి సమర్పించుకోమంటారు వారు సమర్పించుకున్నాక సీనియర్ సన్యాసుల వద్దకు సేవకు ట్రైనింగ్‌కి పంపిస్తారు అంతేగాని ఈ స్త్రీలను మెస్సీయ సేవకు పిలువలేదు. ఆయన వీళ్ళను అంగీకరించడు. సౌలును తీసుకొండి సౌలు పెండ్లి చేసుకోలేదు. ఆయన ఆయనవలె ఉండమన్నాడు. 1కొరింధి 7:8. సౌలు వీళ్ళలా ఆడవాళ్ళను వెంట వేసుకుని తిరిగాడా? వీళ్ళది ఎవరిమాదిరి?

1. సౌలు, బర్నబా, యోహాను కలిసి మొదటి మిషనరీ ప్రయాణం చేసారు.

2. సౌలు, సీల, తిమోతి మొ॥గు వారు కలిసి రెండం మిషనరీ ప్రయాణం చేసారు.

3. సౌలు + ఇతరులు కలిసి మూడవ మిషనరీ ప్రయాణం చేసారు.

మాది మెస్సీయ మాదిరి. సౌలు మాదిరి పెళ్ళి చేసుకోలేదు అని సోదె చెప్తున్న ఈ సోదె సన్యాసులు మెస్సీయ వలెను, సౌలు వలెను సహోదరులతో కాక సహోదరీలతో సేవ ఏమిటి? సిస్టర్ సిస్టర్ అంటూనే సిస్టర్‌ని పెళ్ళి చేసుకుని గెంటి వేయబడిన బయటకు వచ్చేసిన సన్యాసి సహోదరులు కూడా ఉన్నారు. సిస్టర్ అంటే ప్రియురాలా? ఒక రకంగా అంతే లెండి. అబ్రహాము అతని భార్యని సిస్టర్ అని చెప్పమన్నాడు. ఇస్సాకు కూడా తన భార్యను సిస్టర్ అన్నాడు. బైబిల్లో ప్రియురాలిని సిస్టర్ అని సంభోదించారు పరమ.4:12 . పాపం సిస్టర్ ప్రియురాలు కూడా తన ప్రియున్ని బ్రదర్‌లా లోకానికి కనిపిస్తూ ఆమెదగ్గరే ఉంటుంటే ఎంతబాగుండునో అని పరమ 8:1 లో అంటుంది. ప్రజలకి బ్రదర్‌లా కనపడాలట. ఈవిడకి మాత్రం ప్రియుడిలా ఉండాలట. చూసారా ఈ సిస్టర్ - బ్రదర్ మాటలు వెనుక ఉన్న మర్మం??? వీళ్ళకి తెలుసు ఆమిషను ఎంత మోసకరమైనదో/ ఎలా వారిని మోసగించిందో/ ఎలా వారిని నిందించి త్రోసివేసిందో?

**4. పెండ్లి అయిన వారితో వీరు కలిసి ఉండరట:-** అది బైబిలుకి సరిపోతుందా? అపోస్తులులకు పెండ్లి కాలేదా? చదవండి ఈ వాక్యం “తక్కిన అపోస్తులుల వలెను, సర్వాధికారి యొక్క సహోదరుల వలెను, కేఫా వలెను విశ్వాసురాలైన భార్యను వెంటబెట్టుకొని తిరుగుటకు మాకు అధికారము లేదా?”

1కొరింధి9:5, అపోస్తలులకు భార్యలు లేరా? అంత బాగా తెలుసా వీళ్ళకి బైబిలు? పెండ్లి అయినవారు పెండ్లికాని అపోస్తలులతో కలిసి పనిచెయ్యలేదా? అకుల- ప్రిస్కిల్లలు సౌలు గారితో పని చెయ్యలేదా (రోమా16:3,4 + అ॥కార్య18:1-4) బైబిలు ఒప్పుకుంటున్నాగాని వీళ్ళ మిషను సిద్ధాంతం ఒప్పుకోదు. ఈ మిషను సిద్ధాంతమే దయ్యం అదే "స్త్రీ". "స్త్రీ సాంగత్యం" అంటే సెక్స్ అని ఏడుస్తారు గాని అసలు ఈ స్త్రీ సాంగత్యం వారి మిషను బానిసత్వమే.

**5. సెక్స్ అపవిత్రమా?:-** సెక్స్ అపవిత్రమని బైబిలు చెప్పలేదు కాని, ఈ దొంగ నపుంసకులు చెప్తున్నారు. సెక్స్ వలన అపవిత్రపరచబడతారని అంటారు. మరి వీరు ఎలాపుట్టారు? సెక్స్ వలన కాదా? వీళ్ళు ఎలా పరిశుద్ధులు? ఈ వాక్యాలు చదివి చెప్పమనండి. **శుద్ధుడగుటకు నరుడు ఏపాటివాడు? నిర్దోషుడగుటకు స్త్రీకి పుట్టినవాడు ఏపాటి వాడు? యోబు 15:14 నరుడు ఎలోహీం దృష్టికి నీతిమంతుడు ఎట్లు కాగలడు? స్త్రీకి పుట్టిన వాడు ఆయన దృష్టికి ఎట్లు శుద్ధుడు కాగలడు?...... యోబు 25:4-6** నేను పాపములో పుట్టిన వాడను పాపములోనే నాతల్లి నన్ను గర్భమున ధరించెను. కీర్తనలు 51:5 భార్య భర్తల సంబంధం గూర్చి వీళ్ళకి ఏమి తెలుసని సెక్స్ విషయాలు మాట్లడతారు? సెక్స్ అపవిత్రం ఎప్పుడు? జారత్వం చేసినపుడు. వ్యభిచారం చేసినపుడు అంతేగాని భార్య భర్తలు దాంపత్యం చేసినపుడు కాదు. సెక్స్ పరిశుద్ధమైనది. పరిశుద్ధుడు పెట్టినది. యాజకులను పెండ్లి చేసుకోవద్దని ఆయన చెప్పలేదు. లేక పెండ్లి చేసుకున్నవాడు యాజకుడు కాదని బైబిల్లో ఎక్కడా లేదు. లేవీయులకన్నా వీరేమైనా గొప్పవారా? లేవీయులు పెండ్లి చేసుకోలేదా? (లేవీ21:7,13,14) మెస్సీయ రక్తం కార్చింది తన వధువు కొరకే, పరమగీతాలు చదవండి తెలుస్తాది ప్రేమంటే ఏమిటో? మనుషుల ఎదుట మనస్సు నిలుపువేసుకుంటున్నట్లు, కామతప్తత లేనట్లు (1 కొరింది 7:9) నటించడం కన్నా, ఆ సాతాను మిషనులో నుండి బయటకు వచ్చి పెళ్ళి చేసుకుని సేవ చెయ్యండి. పరమతండ్రి హర్షిస్తాడు.

**6. మీ మిషనే ఒక స్త్రీ/ స్త్రీ సాంగత్యం:-** మీరు దానిలోనికి వెళ్ళి దూరినవాడే ఉరులలోను/ బంధకాలోను (స్త్రీ సాంగత్యంలో)పడిపోయారు. "మరణము కంటే ఎక్కువ దు:ఖము కలిగించునది ఒకటి నాకు కనబడెను, అది వలల వంటిదై, ఉరుల వంటి మనస్సును బంధకముల వంటి చేతులను కలిగిన స్త్రీ" ప్రసంగి 7:26 మీ సహవాసమే స్త్రీ సాంగత్యం. ప్రకటన 17 అధ్యాయం లోని స్త్రీయే మీరు. దాని తప్పుడు సిద్ధాంతాలే మీరు బోధిస్తుంది. మీరు గుడ్డినాయకులు, దొంగ అపోస్తలులు నేను ఋజువు చేస్తాను రండి. బైబిలు తీసుకొని రండి మాట్లడదాం. ప్రకటన 14:3 లోని క్రొత్త కీర్తన మీకు తెలుసా? సీయోను పర్వతం మీద 144,000 మంది మీరేనా? యెహోవ సాక్షులనే సాతాను సాక్షులు వారే అంటున్నారు. ప్రకటన 14:4 లోని ప్రథమ ఫలము ఎవరో మీకు తెలుసా? మీ బోధ అంతా అబద్ధమే గదా! వీరి నోట ఏ అబద్ధమును కనబడలేదు. వీరు అనింధ్యులు అనేది మీకెలా వర్తిస్తుంది?

**7. మీరు ఎవరికోసం సంపాదిస్తున్నారు?:-** "సంస్థ" అంటేనే సాతాను. అందరూ వాళ్ళ పేర్లమీద సంపాదించుకుంటున్నారు. మీరు "సంస్థ" పేరున సంపాదిస్తున్నారు. వాళ్ళు మీరు ఒకటే గదా! మీ ప్రత్యేకత ఏమిటి? మీ మిషను బోర్డు బైబిల్లో చూపించగలరా? అదే పేరు మీద ఆది అపోస్తలులు సంస్థ నడిపించారా? మీ సంస్థ ఫౌండర్ పెండ్లి అయినవాడు, అతను సౌత్ ఇండియన్ గనుక మీరు అతని డ్రస్ వాడుతున్నారు. ఆంధ్రావాడు ఎవడైనా మద్రాస్ లుంగీ కడతాడా? అపోస్తలులెవరైనా మీసం గడ్డం గొరిగించుకున్నారా? మీసం, గడ్డం గొరిగించుకోవడం ఆడంగి వేషం, బైబిలు దాన్ని ఖండిస్తుంది. మీ మిషను అంగీకరిస్తుంది. మీరు మీ మిషన్ చెప్పినట్లు చేస్తారు గాని బైబిలు చెప్పినట్లు చేయరు. అలాంటప్పుడు మీకు బైబిలు ఎందుకు? బైబిలు లేకపోతే ప్రజలు నమ్మరు.ప్రజల్ని నమ్మించాలంటే బైబిలు పట్టుకోవాలి. బైబిలు ద్వారా మోసం చెయ్యడం అన్నమాట. పేరు ఆయనది బ్రతుకు మీది అన్నమాట. యెషయా 4:1 లోని స్త్రీలుమీరు. సర్వమూ వదిలేసినవారు సర్వము వదిలేసి ఉండాలి గదా! మరి కట్టడాలు ఏమిటి? మీ లగ్జరీ ఏమిటి? మీరు ఈ లోకసంబంధులు కానప్పుడు ఈ లోకంలో ఎందుకు సంపాదిస్తున్నారు? ఆది అపోస్తలులవలె అక్కరగా ఉన్నవారికి ఎందుకు పంచిపెట్టరు? అ॥కార్య 4:35 అన్నీ వదులుకొని వెళ్ళి మళ్ళీ అన్నీ సంపాదించడం ఎందుకు? ఆదిలో విశ్వాసం ఇప్పుడు శరీరానుసారమే గదా! కాదని చెప్పగలరా? అపోస్తలుడైన సౌలు అద్దె ఇంట్లో ఉన్నాడు. (అ॥కార్య 28:30) హతసాక్షి అయ్యాడు. మీరు స్వంత గృహాల్లో ఉంటూ అపోస్తలులంటే మేమెలా నమ్మాలి? మీలో ఎంతమంది హతసాక్షులయ్యారు?

**8. ప్రకటన 14:1,3 లోని 144,000 మీరా?:-** ఇంతకూ మీరంతా కలిసి 144,000 ఉన్నారా? ఏ గోత్రాలు మీవి? ఎన్ని గోత్రాలు మీరంతా? మీ మూల పురుషుడు ఎవరు?

**9. మీరే బానిసలు స్వతంత్ర్యత ఎలా ఇవ్వగలరు?:-** బ్రతకడమే పెద్ద ఇబ్బందిగా ఉంది అందుకే మిషనులో దూరి, దాని సిద్ధాంతాలు ప్రకారం నడుస్తామని ఆ తప్పుడు సిద్ధాంతాలను అంగీకరించి, ఆమిషనులోనే పనిచెయ్యడానికి వెళ్ళారు మీరు అంతేకాని ఆయన పిలుపు విని కాదు. ఆయన సేవ కొరకు కాదు. మీలాంటి వాడే ఒకడు మీకా మిషనులో దూరాడు. వాడి బ్రతుకు మీ బ్రతుకు ఒకటే అందుకే చదువుకోండి న్యాయాధి 17,18 అధ్యాయాలు. ఆ లేవీయునిలా మీరు కూడా మీ మిషను వదిలి బయటకు వచ్చిననాడే మీరు స్వతంత్రులు. మీకు ఇప్పుడు స్వతంత్రత ఏముంది? మీ సాతాను కమిటీ ట్రాన్స్‌ఫర్ చేస్తే పెట్టె- బట్టలు తీసుకొని వెళ్ళాల్సిందే గదా? తిరగబడితే తిన్నగా కేర్ ఆఫ్ ప్లాట్ ఫారమే గదా మీ బ్రతుకు? తల్లిదండ్రుల దగ్గరకు వెళ్ళ లేరు గదా! వాళ్ళని యావే నామంలో మోసం చేసి వాళ్ళ ఆస్తి కాజేసి దొంగ అపోస్తలులు పాదాల దగ్గర పెట్టారు గదా!

**10. మీ భాషలు పరిశుద్ధాత్మ సూచకమేనా?:-** నిజంగా మీరు మాట్లాడే భాషలు పరిశుద్ధాత్మకు సూచకమైతే, సూర్యారాధన దినమైన ఆదివారం రోజున ఆరాధన ఎలా చేస్తున్నారు? సబ్బాతుని ఎందుకు ఉల్లంఘిస్తున్నారు? మెస్సీయ సబ్బాతును కొట్టివేయలేదే? మత్తయి 24:20 త్రిత్వమనే దుర్బోధ, డిసెంబర్ 31 వాచ్‌నైట్ సర్వీస్ అనే సాతాను సిద్ధాంతం ( మీకు బైబిలు క్యాలెండరు ఎందుకు తెలియడం లేదు) ఎందుకు చేస్తున్నారు. మీరు నిజంగా పరిశుద్ధాత్మను పొందితే, ఆయన ఆజ్ఞలను త్రోసివేసి మానవ సిద్ధాంతాలను/మిషను పడికట్లను ఎందుకు పాటిస్తున్నారు? మత్తయి 15:6. పరిశుద్ధాత్మ అంటూ మీరు పొందితే, ఆయన ఆజ్ఞలు తప్పక పాటించవలసిందే. మీరు పాటించడం లేదంటే మీలో పరిశుద్ధాత్మ లేనే లేదని ఖచ్చితమైన ఋజువు మీకు కావాలంటే ఈ వచనాలు చదవండి. యెహెజ్కేలు 11:19,20,36:26,27, ఆజ్ఞలు పాటించడాన్ని బట్టే పరిశుద్ధాత్మ పొందారో లేదో చెప్పగలం గాని ఎగిరి గంతులువేసి నత్తిమాటలు అర్ధంకాని శబ్దాలు చెయ్యడం బట్టి కాదని మీరు గ్రహించండి.

**11. మిగతా వారిది ఫ్యాషనా? మీది ఫ్యాషనా?:-** యూనిఫారం ఫ్యాషన్ కదా? అది అపోస్తలుల యూనిఫారం మీకు తెలుసా? మీది ఆది అపోస్తలుల అనుకరణా? మెస్సీయ డ్రస్ మీకు తెలుసా? అపోస్తలులు ఎవరైనా మీకులా ఆడంగి వేషం వేసారనుకుంటున్నారా? గడ్డం, మీసం తీసివేయ్యడం ఆడంగి లక్షణం, చదవండి ఈ వాక్యాలు. లేవీ 19:27,21:5 ఎజ్రా 9:3, యెహె 5:1, కీర్తనలు 133:2, 1సమూ21:13, ద్వితి 22:5, యెషయా 50:6, 2సమూ10:4,5, 1దినవృ19:45, 2సమూ19:24, యెషయా 7:20,15:22,41:5-7, 48ర37, 25:23, 9:26. మీకు తెలుసో లేదో గాని మీ యూనిఫారం డిజైనర్ లూసీఫర్ గాడు, వారు వెలుగుదూత (వైట్ డ్రస్) వేషంలో ఉన్నాడు. మీలో లూసీఫర్‌ని నేను చూస్తున్నాను. వాడుఆడంగివాడు వాడికి గడ్డం, మీసం ఉండవు, యావే బిడ్డలకి గడ్డం మీసం లేకపోతే అవమానంగా భావిస్తారు. (2సమూ10:4,5) మీసం గడ్డం గొరిగించుకోవడాన్ని మీకు సిగ్గులేదా? నీతిహీనులు సిగ్గునెరుగరని బైబిలు చెప్తుంది. మీరు నీతిమంతులా? నీతిహీనులా? మీరు స్త్రీలా గడ్డం గొరిగించుకోవడాన్ని, మీసాలు తీసివేయడాన్ని? సృష్టికర్తనే అవమాన పరుస్తారన్నమాట. మీ మిషనుకి మీసం, గడ్డం అడ్డమన్నమాట. ఇక్కడ తమకి బైబిలుతో సంబంధంలేదు. కాలర్‌లెస్ షర్ట్ ఫ్యాషన్ కాదా? లుంగీలు కట్టడం మద్రాస్ వారి ఆచారం కాదా? తమ మిషన్ ఎక్కడ పుట్టిందో (యెరూషలేములోని అపోస్తలుల స్థలం) లేక తమ మిషన్ ఫౌండర్ వేసిన డ్రస్ అదేనేమో?

**12.ఆభరణాలు మందులు తప్పా?:-** స్త్రీలైన మీరు నగలు లేక ఆభరణాలు ఎందుకు ధరించారో కాస్త చెప్పండి. చెప్పేముందు ఈ ఆభరణాలు ఎవరు ఎవరికి పెట్టారో అదీ చెప్పండి. యెహెజ్కేలు 16:9-14, లూకా 15:22, పరమ 1:10,11, (ఉంగరం తప్పు అయితే, పాదరక్షలు తప్పేగదా? బంగారం పెట్టుకోవడం తప్పు అయితే, మరి సింగారానికి చెప్పులు తప్పుకావా?) స్త్రీలకు తలవెంట్రుకలు పైటచెంగుగా ఇవ్వబడినవి (1కొరింధి 11:15) మరి తమరు ముడివేయడం తప్పుకాదా? అది బైబిలుకి వ్యతిరేఖమైన ఫ్యాషన్ కాదా? స్నోలు పౌడర్‌లు తప్పు అయితే సబ్బులు వాడడం తప్పుకాదేమో? వెనకటికి ఎవడో అన్నాడట "నేను మాంసం తిననుగాని మాంసంలో పులుసు త్రాగుతాను" అని అలా ఉంది మీ సోది మిషన్ సోది బోధ. దైవిక స్వస్థత అంటూ మందులు తప్పు అని బోధిస్తూ పురుళ్ళు మాత్రం ఆసుపత్రిలో పోసుకుంటూఉంటారు. ఇది మీ నక్కజిత్తుల బోధ. దోమను ఒడియగట్టి ఒంటెను మింగే దొంగ రకాలన్నమాట. మనం తినే ప్రతీదానిలోను మందు (Medicine) ఉన్నదన్న సంగతి తమకు తెలుసా? "యావే స్వస్థపరచదు అని గాని, స్వస్థతలు లేవు అనిగాని నేను అనడంలేదు" కాని మీ బోధ మాత్రం ఖండితంగా తప్పు అని చెప్పగలను. మెడిసిన్ గూర్చి బైబిల్లో ఉంది. మెడిసిన్ గూర్చి మీరు బోధించేది మాత్రం 100% తప్పు. కొన్ని వాక్యాలు తీసుకొని మిగతా వాక్యాలను వదిలెయ్యడం కాదు. మీరు కళ్ళజోళ్ళు ఎందుకు పెడుతున్నారు? మీకు సైట్ ఎందుకు వచ్చింది? పాలు, నీళ్ళు, ఉప్పు, కారం, ఇవన్నీ మెడిసిన్‌లోకి రావా? మజ్జిగలోను, జ్యూస్‌ల్లోనూ, కాఫీ, బోర్నవిటా మొ॥గు డ్రింక్‌లో మెడిసిన్ లేదా? ఏమి బుద్ధిహీనపు బోధలు మీవి?

**13. మీరు చందా ఎత్తరా?:-** మీరు చందాలు, కానుకలు, దశమభాగములు విశ్వాసుల దగ్గర దొంగిలించకుండానే బ్రతికేస్తున్నారా? దోపిడి గాళ్ళందరిలో స్పెషల్ టైపు దోపిడీ మీది. ఎటాచ్డ్ విశ్వాసులు మోసపోతున్నారు. గాని మీరు మాత్రం వారిని బాగానే మోసం చేస్తున్నారు. మీ వేషం చూసి పద్దారు విశ్వాసులు మీతో అగ్నిగుండానికి.

**14. సమాధానం చెప్పక పోవడం?:-** 1పేతురు 3:16 ప్రకారం హేతువు అడుగు ప్రతీవానికి సమాధానం చెప్పమంటుంటే మీరేంటి నోరుమూసుకుని మౌనంగా ఉండటం. మీ దగ్గర జవాబు లేదు. మీరు వాక్యం తెలియని అమాయకులను మోసం చెయ్యగలరు గాని వాక్యం తెలిసిన వాని దగ్గర మీ నాటకాలు సాగవు గనుకనే మౌనం వహిస్తున్నారు. మౌనం వహించడం సాతాను లక్షణం. చదువుకోండి ఈ వాక్యాలు మత్తయి 22:12+45

**15. ఇంతకీ సంసారులా? సన్యాసులా? లేక అటు - ఇటు కాని?:-** సంసారి బోధకులు ఆడవారి వంటే తింటున్నారు. మరి సన్యాసి బోధకులు ఆడవారి వంటే తింటున్నారు. స్త్రీ లేకపోతే మగవాడికి మనుగడే లేదని మీరూ ఋజువు చేస్తున్నపుడు, మీకు సన్యాసం ఎందుకు? బైబిల్లో బేసిక్ ఎలిమెంట్స్ తెలియని మీరు, సంసారి బోధకులకన్నా ఏమంత గొప్పవారు? మీరు నిజంగా అంత గొప్పగా మెస్సీయను ప్రేమించి ఆయన సేవను చెయ్యడాన్ని వచ్చారా? వస్తే ఆయన ఒరిజినల్ నామము యషువ మెస్సీయను ఎందుకు ప్రచురించుటలేదు? బైబిల్లోని పండుగలను ఏల ఆచరించడం లేదు? పైగా బైబిలుకి వ్యతిరేకమైన క్రియలు బోధలు చేయడం ఏమిటి?

**16. 1తిమోతి 4:1-2 లోని వారు వీరే:-** వీళ్ళ సమర్పణ తప్పు, వీళ్ళ ట్రయినింగ్ తప్పు, వీళ్ళ వేషం తప్పు, వీళ్ళ బోధ 100% తప్పు. 1తిమోతి 4:1,2 లోని వారు వీరే, ఒక వేళ కాదని వీరు చెప్పగలిగితే మరి వారు ఎవరో వీరినే చెప్పమనండి. వీళ్ళకి అసలు "రక్షణ" లేదు. రక్షణ నామం వీరికి తెలియదు. వీరిచ్చే బాప్తిస్మం చెల్లనిది. ఆది అపోస్తలులెవరూ అలా త్రిత్వంలో ఇవ్వలేదు. త్రిత్వము సాతాను బోధ, ఆదివారం ఆరాధన సాతానుది. అందుకే వీరు 100% సాతాను రాయబారులు అంటున్నాము. అపోస్తలు కాకయే అపోస్తలులమని చెప్పుకునే దొంగ అపోస్తలులు వీరు. బహిరంగంగా పత్రికాముఖంగా ఖండిస్తున్నాను కాదని వారిని వాక్యం ద్వారా ఋజువు చెయ్యమనండి. వీరి విషయమై ప్రజలు జాగ్రత్తపడవలసి ఉంది. ఏర్పాటు చేయబడిన వారిని సహితం మోసం చేయగల దురాత్మల సమూహమే ఈ పెండ్లి చేసుకోకుండా తిరుగుచున్న అబద్ధబోధకుల సమూహము.

**ఆఖరిగా నీకు/మీకు నా సలహా:-** నీవు నిజంగా యిర్మియా వలె (యిర్మియా 16:2) అవివాహితుడుగా పిలువబడితే, ఆ సాతాను మిషను నుండి బయటకు వచ్చి అన్ని డినామినేషన్‌ల వారికి ఆ లేవీయునివలె (న్యాయాధి 18:19,20) సువార్త ప్రకటించు. నీవు నిజంగా సౌలు వలె పిలువబడితే, సౌలువలె అన్నీ సమాజములవారి గూర్చి చింతకలిగి అన్ని సంఘములకు సువార్త ప్రకటించు.

నీవు నిజంగా మెస్సీయ కొరకే పుడితే, లేక మెస్సీయ కొరకు బ్రతకాలనుకుంటే, అపోలో వలె (అ॥కార్య 18:24-27) సత్యాన్ని మరింతగా తెలుసుకొని బాప్తిస్మమిచ్చిన యోహానువలె దొంగ బోధలను, దుర్బోధలను ఖండించి అవసరమైతే హతసాక్షివి అయిపో. అంతేగాని సాతాను మిషనులో ఉండి సాతాను బోధ చేస్తూ సోది వల్లించకు. సర్వమూ వదిలి వచ్చి సర్వనాశనం అవ్వకు.

Printed, Published and Owned by Isaac. E. Kusuma and Printed at Ratna Offset, Malikipuram -533 253. E.G. Dt. and Publsihed at Malikipuram Editor Isaac E. Kusuma. All rights reserved